
సాక్షి ఒడిశా

గురువారం । 28 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,87,227లు, బంగారం 1గ్రాము 880 మిల్లీగ్రాములు, వెండి 27 గ్రాములు 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



శ్రీక్షేత్రానికి ఆహ్వానం

పూరీ శ్రీజగన్నాథ దేవస్థానం సరికొత్త రూపురేఖలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది.

- 8లో



కళలు పరిరక్షించడం అందరి బాధ్యత

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న చౌయితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

కరోనా కలకలం



భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా మరో 2 కోవిడ్ పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. దీంతో బుధవారం నాటికి రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 5కి చేరింది. ఈ నెలలో లోగడ 3 కేసులు గుర్తించబడ్డాయి. ఈ బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ రోగుల్లో ఇద్దరికి ఎటువంటి ప్రయాణ చరిత్ర లేదు, మిగిలిన ముగ్గురిలో దర్యాప్తు జరుగుతోంది. బుధవారం నాటికి దేశంలో మొత్తం క్రియాశీల కోవిడ్ రోగుల సంఖ్య 4,059కి చేరుకుంది. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, గుజరాత్, గోవాలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు మాస్క్ ధరించాలని, రద్దీగా ఉండే ప్రదేశాలను సందర్శించకుండా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ సూచించింది. ఈ సంక్రమణ అణిచివేతకు తిరిగి కోవిడ్ నిబంధనలను అమలు చేయాలని యోచిస్తున్నారు. సంక్రమణ తలెత్తిన ప్రాంతాల్లో రాష్ట్రం వెలుపలి నుంచి వచ్చే పర్యాటకులపై అధికారులు నిఘా వేస్తున్నారు. తాజాగా కోవిడ్ పాజిటివ్ ఖరారైన వారిలో కరోనా లక్షణాలు తేలికపాటివని ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ విజయ్ మహాపాత్రో తెలిపారు. వీరిలో జలుబు, దగ్గు మాత్రమే ఉందన్నారు. ఆస్పత్రిలో ఎవరూ లేరని, ఇంట్లోనే చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే భూపిందర్‌కు గాయాలు



గ్రౌండ్‌లో పడిపోయిన ఎమ్మెల్యే భూపిందర్

భువనేశ్వర్: క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో నౌర్లా నియోజకవర్గం ఎమ్మెల్యే భూపిందర్ సింఘ్ గాయపడ్డారు. ఎమ్మెల్యే భూపిందర్ సింఘ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించేందుకు కలహండి కెసింగా మండలం తలొభంపురా గ్రామానికి వెళ్లారు. ప్రారంభ మ్యాచ్‌లో మైదానంలో బ్యాటింగ్ ప్రారంభించే క్రమంలో కుప్పకూలిపోయారు. అతడి తలకు గాయమైంది. బెలొఖొండి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.

నృసింహానంద బ్రహ్మ మృతి




నృసింహానంద బ్రహ్మ

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రథమ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నృసింహానంద బ్రహ్మ(90) ఇక లేరు. ఆయన బరంపురంలోని తన కుమారుడు ఇంటివద్ద మరణించారు. ఆయన మరణ వార్తతో కోట్‌పాడ్ ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. బ్రహ్మ 1953లో రాజకీయాల్లోకి విచ్చేశారు. ఆ ఏడాది జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దమనహండి గ్రామ సర్పంచ్‌గా పోటీచేసి విజయం సాధించారు. 1954లో కాంగ్రెస్ చేరారు. 1961లో అవిభక్త కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రథమ చైర్మన్‌గా ఎన్నికై 1967 వరకు కొనసాగారు. తర్వాత కాలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కొరాపుట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా పోటీచేసి గెలిపొందారు. అలాగే 1990లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మరోసారి ఎన్నికయ్యారు. 1992లో జిల్లా విభజన తర్వాత నృసింహానంద బ్రహ్మ రాయగడ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, ఏఐసీసీ సభ్యునిగా నియమితులయ్యారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జానకీ వల్లభ పట్నాయక్‌కు బ్రహ్మ అత్యంత సన్నిహితుడు. వృద్ధాప్యంతో ఆయన కొద్దికాలంగా బరంపురంలో ఉంటున్న తన పెద్ద కుమారుడు విశ్రాంత హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బ్రజ కిశోర్ వద్ద ఉంటూ మంగళవారం సాయంత్రం మరణించారు.

ఎవరో వారెవరో..!

- నెలాఖరు నాటికి సీఎస్, డీజీపీల ఉద్యోగ విరమణ
- కొత్తవారి నియామకంపై ఉత్కంఠ
- తొలిసారిగా మహిళలకు అవకాశం..?



భువనేశ్వర్: ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) ఉద్యోగ విరామం పొందనున్నారు. దీంతో వీరి స్థానాల్లో కొత్తవారి నియామకంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్ ఉద్యోగ పరిమితి ఈనెల 31వ తేదీతో పూర్తవుతుంది. యాదృచ్ఛికంగా చోటుచేసుకుంటున్న ఈ పరిస్థితిని సార్వత్రిక ఎన్నికలకు సానుకూలంగా మార్చుకునేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు కీలక పదవుల్లో మహిళలకు స్థానం కల్పించి మహిళా ఓటర్ సెంటిమెంట్‌ను సొమ్ము చేసుకునే యోచనపై రాజకీయ శిబిరాల్లో చర్చ సాగుతోంది. ఈ వ్యూహం వాస్తవ కార్యాచరణ నోచుకుంటే రాష్ట్రంలో తొలిసారిగా మహిళా అభ్యర్థులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు హోదాల్లో నియమితులయ్యే అవకాశం ఉంది. దేశ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో రాష్ట్రంలో ఇంతవరకు మహిళలకు ఈ హోదా లభించలేదు.

కొనసాగింపు..?

ఈ నెలాఖరుతో ఉద్యోగ విరామం పొందనున్న డీజీపీ, చీఫ్ సెక్రటరీల ఉద్యోగ కాల పరిమితి పొడిగించే యోచన సైతం ఉన్నట్లు సమాచారం. అయితే వీరిలో ఒకరిని మాత్రమే కొనసాగించి, మరొకరి స్థానంలో కొత్త వ్యక్తిని నియమించే యోచనతో ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పొడిగింపు వర్తించే అధికారికి 6 నెలలపాటు నిరవధికంగా కొనసాగే అవకాశం ఉంటుంది. ఇలా అయితే సార్వత్రిక ఎన్నికల తంతు ముగిసేంత వరకు పాత అధికారి ఆధ్వర్యంలో కీలక ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ లెక్కన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఉద్యోగ కాల పరిమితిని విస్తరించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తుంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ముగ్గురు ప్రతిపాదిత డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అభ్యర్థుల పేర్లు యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు సిఫారసు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ సకాలంలో పూర్తి కాకుంటే తాత్కాలిక డీజీపీ నియామకంతో కాలక్షేపం చేసేందుకు అవకాశం ఉందని చర్చ సాగుతోంది.

మహిళలకు అవకాశం

ప్రతి రంగంలో మహిళలకు పెద్దపీట వేసే దిశలో నవీన్ పట్నాయక్ సర్కారు ముందడుగు వేస్తోంది. దీనిలో భాగంగా ఇదివరకే భారత పార్లమెంట్‌కు 33 శాతం మంది మహిళా అభ్యర్థులకు ప్రాతినిధ్యం కల్పించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికల్లో మూడో వంతు మహిళ అభ్యర్థులను బరిలోకి దింపే యోచనతో బిజూ జనతా దళ్ పావులు కదుపుతున్నట్లు సమాచారం. తాజాగా రాష్ట్ర శాసన సభకు ప్రమీలా మల్లిక్‌ని తొలి మహిళా స్పీకర్‌గా నియమించి సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ఇదే ప్రేరణతో త్వరలో ఖాళీ కానున్న చీఫ్ సెక్రటరీ, డీజీపీ హోదాల్లో మహిళా అభ్యర్థులకు పట్టం గట్టే యోచనతో పని చేస్తోంది. మరో వైపు ప్రజానాడిని పసిగడుతోంది. ప్రధానంగా డీజీపీ హోదాకు మహిళా అభ్యర్థి ఉవ్విళూరుతున్నట్లు సమాచారం. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఇంతవరకు ప్రతిపాదించాల్సిన 3 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించక పోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ముందంజలో ముగ్గురు

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు హోదా కోసం 3 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు ముందంజలో ఉన్నారు. వీరిలో ఒకరు మహిళ ఉన్నారు. ఐపీఎస్ వైబీ ఖురానియా తదుపరి డీజీపీగా ఎంపికయ్యే అవకాశం ఉన్నటువంటి ముగ్గురు ప్రముఖులలో ఒకరుగా ఉన్నారు. 1989 సంవత్సరపు బ్యాచ్‌కు చెందిన 2 మంది అధికారుల సరసన ఖురానియా చోటు చేసుకుని రేసుని రసవత్తరం చేశారు.

శరవేగంగా ఎయిర్ పోర్టు పనులు



మల్కాన్‌గిరి ఎయిర్ పోర్టు భవనం

- జనవరిలో సీఎం చేతులమీదుగా ప్రారంభం
- రూ.50 కోట్లతో పనులు పూర్తి

మల్కాన్‌గిరి: జిల్లాలో జనవరి మొదటి వారంలో ప్రారంభమవ్వనున్న ఎయిర్ పోర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మొదట రూ.30 కోట్లతో పనులు ప్రారంభించగా, పెరిగిన అంచనాల నేపథ్యంలో రూ.50 కోట్లు నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశారు. మొత్తం 1,600 మీటర్ల రన్‌వే నిర్మించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరగనుంది.

గిరిజనుల హర్షం

మల్కాన్‌గిరి జిల్లా అంటే ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉండేది. ఇక్కడి గిరిజనులు హెలికాప్టర్ వస్తే వింతగా చూసేవారు. అలాంటి ప్రాంతంలో ప్రస్తుతం ఎయిర్ పోర్టు పూర్తవుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో 5టీ కార్యదర్శి పాండియన్ మల్కాన్‌గిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టు పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అప్పటి నుంచి యుద్ధ ప్రాతిపదికన పనులు జరిగాయి. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర రవాణా శాఖ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు మల్కాన్‌గిరి వచ్చి పనులను పరిశీలించారు.

భువనేశ్వర్‌కు సర్వీసులు

ముందుగా భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వరకు సర్వీసులు ప్రారంభిస్తారు. ముందుగా 20 మందితో కూడిన చిన్న విమానాలు నడుపుతారు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు వివిధ విమాన సంస్థలతో చర్చించారు. మల్కాన్‌గిరి ఎయిర్ పోర్టు బోర్డును స్థాపించడంతో ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివలన తమ ప్రాంతాలు మరింత అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఆకాంక్షిస్తున్నారు.



రన్‌వే పనులు నిర్వహిస్తున్న దృశ్యం



జేసీబీతో రన్‌వే పరిసరాలు చదును చేస్తున్న దృశ్యం

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: గంజాం జిల్లా హింజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధి కుంకురడా గ్రామంలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి 6 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి మహేంద్రకుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు.. కుంకురడా గ్రామంలోని ఒక ఇంటిలో కొద్ది రోజులుగా జూదం అడ్డా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గంజాం ఎస్పీ బ్రాజేష్ కుమార్ రాయ్ ఆదేశాలతో పోలీసులు బుధవారం దాడిచేసి అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.47 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలు, రెండు పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

చంద్రపూర్‌లో నిజ నిర్ధారణ బృందం



హత్యకు గల కారణాలు ఆరా తీస్తున్న నిజ నిర్ధారణ బృందం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో యువతి హత్య ఘటనకు సంబంధించి బీజేపీ మహిళా మోర్చ ఆదేశానుసారం ఆ పార్టీకి చెందిన రాష్ట్రశాఖ మహిళా మోర్చ సాధారణ కార్యదర్శి బబితా పాత్రో నేతృత్వంలో ఆ పార్టీ నిజ నిర్ధారణ బృందం చంద్రపూర్‌లో బుధవారం పర్యటించింది. ఈ నెల 21వ తేదీన టికిరి పోలీసుస్టేషన్ పరిధి నకిటి గుడ గ్రామానికి చెందిన బేలుధర్ మాఝి కుమార్తె హత్యకు గురైంది. చంద్రపూర్‌లో మా గృహంలో మేనేజరుగా పనిచేస్తున్న ఆమె కాలిపోయిన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్యకు సంబంధించి ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడంతో ఈ బృందం చంద్రపూర్‌లో పర్యటించి వివరాలను సేకరించింది. ముందుగా హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చంద్రపూర్ పోలీసులతో సమావేశమై హత్యకు గల కారణాలను ఆరాతీశారు. కొంతమంది ఆ ప్రాంత వాసులతో మాట్లాడారు. బృందంలో అరుణిమా సాహు, కె.అశ్విని, పార్టీ ఎస్సీ, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు కాశీరాం మాఝి, శివకుమార్ ఉలక తదితరులు ఉన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

మహిళ హత్యకు సంబంధించిన నిందితులను అరెస్టు చేయాలని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి బబితలత పాత్రో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. మా గృహంలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆదివాసీ మహిళ లక్ష్మీ మాఝిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో హత్యకు సంబంధించి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆమెతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివపట్నాయక్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.లక్ష్మి, శివశంకర్ ఉలక తదితరులు ఉన్నారు.

షరతులతో అనుమతులు

- న్యూ ఇయర్ వేడుకలపై ప్రకటన

భువనేశ్వర్: నూతన సంవత్సరం వేడుకలకు సంబంధించి నగరంలో బార్‌లు, హోటళ్ల మూసివేత సమయాన్ని పోలీస్ కమిషనరేట్ సడలించింది. వేడుకల ఏర్పాట్లపై భువనేశ్వర్ డీసీపీ అధ్యక్షతన హోటళ్లు, బార్ల ప్రతినిధులు, పోలీసు అధికారుల మధ్య సమావేశం జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. మార్గదర్శకాల ప్రకారం హోటళ్లు, బార్లు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు షరతులతో అనుమతించారు.

వేడుకలకు అనుమతి

జీరో నైట్ వేడుకలపై స్థానిక కమిషనరేట్ పోలీసులు హోటళ్లు, క్లబ్‌లు, బార్లు, సాధారణ ప్రజలకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని హోటళ్లు, క్లబ్బులు, బార్లు తమ సంస్థలను ఆరోజు రాత్రి 12.30 గంటలకు మూసివేయాలని నగర డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. అతిథుల సంఖ్య వారి సామర్థ్య పరిమితులను మించకుండా జాగ్రత్త వహించాలన్నారు. మొరాయిస్తున్న సీసీ టీవీల మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. పార్కింగ్ పాయింట్ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి మద్యం సేవించినవారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చేందుకు అదనపు చెల్లింపుతో ప్రత్యేక డ్రైవర్లను ఏర్పాటు చేయాలన్నారు.

పోలీసుల ప్రత్యేక తనిఖీలు

తమ వంతుగా పోలీసులు అదనపు బలగాలను మోహరించి నగర వ్యాప్తంగా పలు పాయింట్ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. రాజధాని నగరమంతటా పోలీసు పహారా పెంచనున్నారు. పోలీసులు క్లస్టర్ హోటళ్లు, క్లబ్‌ల దగ్గర అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని అరికట్టేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా తనిఖీ చేస్తారు. కొత్త సంవత్సర వేడుకలు ఉల్లాసంగా జరుపుకోవాలని, అయితే ఒకరి వేడుకలు మరొకరికి బాధగా మారకుండా చూసుకోవాలని డీసీపీ ప్రతీక్ సింగ్ ప్రజలను అభ్యర్థించారు.

వేర్వేరు ప్రమాదాల్లో మూడు ఏనుగులు మృతి



మృతి చెందిన గున్న ఏనుగు



నయాగడ్‌లో మృతి చెందిన గజరాజు

- ఇద్దరు నిందితులు అరెస్టు

భువనేశ్వర్: నయాగడ్ జిల్లా రొణొపూర్ అటవీ ప్రాంతంలో గాయపడి చికిత్స పొందుతున్న ఏనుగు బుధవారం ఉదయం మృతి చెందింది. వేటగాడు పేల్చిన తూటా కారణంగా ఏనుగు కాలికి గాయమైందనే అనుమానంతో నందన్‌కానన్ జూలాజికల్ పార్క్‌కు చెందిన జంతు వైద్య నిపుణుల బృందం చికిత్స చేపట్టింది. వీరి ప్రయత్నం ఫలించలేదు. గాయం మానకుండా మరింత సంక్రమించడంతో మరణానికి దారితీసిందని అనుబంధ వర్గాలు తెలిపాయి. గాయాల వెనుక ఖచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని పేర్కొన్నారు. శనివారం ఈ అటవీ ప్రాంతం కాంచన్‌పూర్ గ్రామ సమీపంలో గాయపడిన ఏనుగును స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు తక్షణమే సమాచారం ఇచ్చినా, సత్వర చర్యలు తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. స్వతహాగా ఆహారం తీసుకునేందుకు సత్తువ చాలని దయనీయ పరిస్థితిలో గాయపడిన ఏనుగు కుప్ప కూలిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో...

ఢెంకనాల్ జిల్లాలో విద్యుత్ షాక్‌తో గున్న ఏనుగు మృతి చెందింది. హిందోల్ అటవీ ప్రాంతం రసోల్ సెక్షన్ రాంపాల్ డ్యామ్ దగ్గర ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. గున్న ఏనుగు వయసు 5 సంవత్సరాలు ఉంటుందని అంచనా. దీని కళేబరం స్వాధీనం చేసుకున్నారు. 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో గున్న ఏనుగు చనిపోయిందని అటవీశాఖ స్పష్టం చేసింది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయి. ప్రజల భద్రత దృష్ట్యా రసూల్ ఫారెస్టర్ సుషేందు భుంయ్యాతో కూడిన స్క్వాడ్ ఈ పరిసరాల్లో పహారా కాస్తూ ఏనుగుల కదలికలపై నిఘా వేస్తున్నారు. సోమవారం రాత్రి ముండియాపాశి గ్రామంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించి వరి పంటలను ధ్వంసం చేసినట్లు గ్రామస్తుడు హరిహర్ సారొ ఫిర్యాదు చేశారు. రాంపాల్ డ్యామ్ సమీపంలో గున్న ఏనుగు కళేబరం పడి ఉంది.

ఇది గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టర్ భుంయ్యా, డీఎఫ్‌వో సుమిత్ కొరా, ఎస్ఈఎఫ్ సత్యానారాయణ సాహు, జూనియర్ ఇంజినీర్ విభూతి భూషణ్ రాణాతో ప్రత్యేక బృందం భువనేశ్వర్ నుంచి సంఘటన స్థలం సందర్శించింది. ఈ బృందం విచారణ జరిపి ఏనుగు కళేబరంపై గాయం ఛాయలు, పరిసరాల పరిస్థితి పరిశీలన మేరకు 11 కేవీ విద్యుత్ తీగ తగిలి మరణించినట్లు ధ్రువీకరించారు. ఘటనపై విచారణ అనంతరం స్థానిక ముండియాపాషి ప్రాంతానికి చెందిన హిరణ్య భొయ్, మహి భొయ్‌లను అరెస్టు చేసినట్లు అటవీ శాఖ అధికారి సుమిత్ కొరా తెలిపారు.

ట్రక్కు ఢీకొని...

జాతీయ రహదారి దాటుతుండగా ప్రమాదానికి గురై ఏనుగు మృతి చెందింది. కెంజొహర్ జిల్లా 49వ నంబర్ జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కెంజొహర్ జిల్లా తెల్కోయి అటవీ ప్రాంతం కొంటాబొహలొ గ్రామ పరిసరాల్లో జాతీయ రహదారి దాటుతున్న ఏనుగుని ఇనుప ఖనిజం రవాణా చేస్తున్న ట్రక్కు ఢీకొనడంతో మృతి చెందింది. అటవీ శాఖ అధికారులు ట్రక్కుని జప్తు చేసి డ్రైవర్‌ని అరెస్టు చేశారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం



నేలమట్టమైన నిర్మాణాలు



అంకులిలో పోలీసు పహారా

స్థానిక 38వ వార్డు అంకులిలో అక్రమాలను బరంపురం అభివృద్ధి సంస్థ, బరంపురం మున్సిపల్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా బుధవారం తొలగించారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. ముందస్తు చర్యగా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ సహకారంతో పోలీసు పహారా ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత 20 ఏళ్లుగా అక్కడే నివసిస్తున్నామని పేర్కొన్నారు. అయితే పోలీసుల చొరవతో గొడవ సద్దుమణిగింది. -బరంపురం

క్లుప్తంగా

వై.వి.సూర్యనారాయణ మృతి తీరని లోటు



సూర్యనారాయణ అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: జెడ్పీ మాజీ చైర్మన్ వై.వి. సూర్యనారాయణ మృతి చెందడం బాధాకరమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సూర్యనారాయణ భౌతికకాయాన్ని బుధవారం అరసవల్లిలోని స్వగృహంలో సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలోనే జిల్లా నుంచి చేరిన మొట్టమొదటి నాయకుడు వై.వి.సూర్యనారాయణ అని కొనియాడారు. ఇలాంటి నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, టీడీపీ నాయకులు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, చౌదరి బాబ్జీ తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో విష్ణుమూర్తి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని క్షేత్రపాలకుడైన విష్ణుమూర్తికి ధనుర్మాసం బుధవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసీ దళాలతో అర్చనలు చేశారు. అనంతరం మంగళహారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెల్లదొరల పాలిట సింహస్వప్నం పుల్లెల



పుల్లెల శ్యామసుందరరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రజాప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తితో తెల్లదొరల పాలిట సింహస్వప్నంగా పుల్లెల శ్యామసుందరరావు నిలిచారని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. రైతు బాంధవుడు శ్యామసుందరరావు 121వ జయంతి సందర్భంగా బుధవారం పీఏసీఎస్ కార్యాలయం ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు సీలాపు సారధిరెడ్డి, తడక జోగారావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, జోగల దిలీప్ యాదవ్ పాల్గొన్నారు.

త్వరితగతిన ఎంపీ ల్యాడ్స్ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి 17వ లోక్ సభ పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం కింద నిధుల వినియోగం, పూర్తయిన పనులు, యూసీల సమర్పణ తదితర అంశాలపై అధికారులతో బుధవారం సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం పార్లమెంట్ తొలి స్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. మంజూరైన మిగతా పనులు కూడా నెలలోగా పూర్తి చేసి యూసీలు సమర్పించాలని సూచించారు. ఎంపీ మాట్లాడుతూ 17వ లోక్‌సభకు సంబంధించి రూ.23.24 కోట్లతో 455 పనులు మంజూరు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్నలక్ష్మి, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కళలు పరిరక్షించడం అందరి బాధ్యత

- రాష్ట్ర వ్యవసాయ విభాగ చీఫ్ సెక్రటరీ అరవింద్ పాడి
- కొనసాగుతున్న చొయితి ఉత్సవాలు



ఆదివాసీ నృత్యం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం



కళాకారులను అభినందిస్తున్న కలెక్టర్ సింగ్



అరవింద్ పాడికి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర వ్యవసాయ విభాగ చీఫ్ సెక్రటరీ డాక్టర్ అరవింద పాడి అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న చొయితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం ముఖ్య అతిథిగా హాజరైన అరవింద్ పాడి మాట్లాడుతూ.. అవిభక్త కొరాపుట్ జిల్లాతో తనకు అవినవభావ సంబంధం ఉందన్నారు. ఇక్కడి భాష, సంస్కృతి, ప్రజల సామాజిక పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేశానని పేర్కొన్నారు. కొరాపుట్, నవరంగపూర్ జిల్లాల్లో కలెక్టర్‌గా వ్యవహరించే సమయంలో ప్రజల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు తెలుసుకున్నానని వెల్లడించారు.

వ్యవసాయ రంగంలో ప్రగతి

రాష్ట్రం వ్యవసాయ రంగంలో ఎంతో ప్రగతి సాధించిందని పాడి తెలియజేశారు. ఒకప్పుడు రాగుల పంట కేవలం ఆదివాసీల సాంప్రదాయ ఆహారంగా ఉండేదని, అయితే నేడు రాగుల విలువ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందన్నారు. పౌష్టికాహారంగా గుర్తింపు పొందిన రాగుల వాడకం ప్రస్తుతం విపరీతంగా పెరిగిందన్నారు. దీనిని అనుసరించి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మిల్లెట్ మిషన్ పేరిట ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేసి, రాగుల ఉత్పత్తికి సహకారం అందిస్తోందని వివరించారు. దక్షిణాంచల్ డీఐజీ చరణ్ సింగ్ మీనా మాట్లాడుతూ చొయితి వేడుకలు కళాకారుల ప్రతిభకు అద్దంపట్టేలా ఉన్నాయని కొనియాడారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కళారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుజరాత్ నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన కొలి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో కళాకారులు తాము చిత్రీకరించిన కళాఖండాలను ప్రదర్శించారు. వీటిని ఆసక్తిగా గమనించిన కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ అభినందించారు. కార్యక్రమంలో మంత్రి జగన్నాథ సరక, ఎస్పీ వివేకానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న అరవింద్ పాఢి తదితరులు



గుజరాతీ కొలి నృత్యం



ఆకట్టుకుంటున్న నృత్య ప్రదర్శనలు



చొయితి వేడుకల్లో ప్రజలు

శ్రీ క్షేత్రానికి ఆహ్వానం



భువనేశ్వర్: తిరుపతి జాతీయ సంస్కృతి విశ్వ విద్యాలయం క్యాంపస్‌కు ఆహ్వానం



భువనేశ్వర్: టీటీడీ అధికారులకు ఆహ్వానం అందజేస్తున్న జగన్నాథ సేవాయత్ బృందం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ దేవస్థానం సరికొత్త రూపురేఖలతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది. శ్రీ మందిరం ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవం భారీ స్థాయిలో నిర్వహించేందుకు శతవిధాలా కృషి చేస్తున్నారు. కొత్త సంవత్సరం 2024 జనవరి 17న శ్రీ జగన్నాథ వారసత్వ ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవం సుముహూర్తం. ఈ వేడుకకు దేశం నలుమూలల విస్తరించిన ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక, దేవస్థానాలు, శ్రీజగన్నాథ ఆలయం నిర్వాహకులు, అర్చక వర్గానికి ప్రత్యేకంగా పిలుపు చేస్తున్నారు. ఈ సందర్భంగా పూరీ శ్రీ మందిరం నుంచి పలు బృందాలు వివిధ ప్రాంతాలకు ఆహ్వాన పత్రికలతో బయల్దేరాయి. ఈ బృందాలు రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాల్లో ప్రముఖులకు పిలుపు చేసి ఆహ్వాన పత్రిక సమర్పిస్తున్నాయి. దక్షిణ భారత దేశంలో పలు ప్రముఖ దేవస్థానాలకు ఈ ఆహ్వానం బుధవారం అందజేశారు.



భువనేశ్వర్: తిరువనంతపురం పద్మనాభ స్వామి దేవస్థానం వర్గాలకు...



భువనేశ్వర్: రామేశ్వరం శ్రీరామనాథ స్వామి దేవస్థానం వర్గాలకు పిలుపు...



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ కమలోచన్ మిశ్రకి ఆహ్వానం అందజేస్తున్న పండితులు



కొరాపుట్: నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానికి ఆహ్వానం అందజేస్తున్న పండితులు



పర్లాకిమిడి: అదనపు కలెక్టర్ జీరేంద్ర కుమార్ దాస్‌కు ఆహ్వాన పత్రికం అందజేత



పర్లాకిమిడి: పూరీ శ్రీమందిరం నుంచి విచ్చేసిన దైతపతులు



పర్లాకిమిడి: దైతపతులకు స్వాగతం పలుకుతున్న కళాకారులు



పర్లాకిమిడి: గజపతి యువరాణి కల్యాణీ దేవికి ఆహ్వాన పత్రిక అందజేత

వేతనాలు చెల్లించాలని ఆందోళన



మిల్లు ఎదుట ఆందోళన చేపడుతున్న కార్మికులు

జయపురం: తమకు బకాయిపడిన 4 నెలల వేతనాలు చెల్లించాలని గగణాపూర్‌లో సేవా పేపరు మిల్లు ముందు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో మిల్లు నుంచి వెళ్తున్న రెండు ట్రక్కులను అడ్డుకున్నారు. తమ జీతాలు ఇచ్చేంతవరకు పేపరు అమ్మేందుకు విడిచిపెట్టమని స్పష్టం చేశారు. తమకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు చెల్లించలేదని, మరికొద్ది రోజుల్లో డిసెంబర్ సైతం పూర్తవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లులో ముడి సరుకు ఉన్నంతవరకు పని చేస్తామని, అయితే తమకు జీతాలు ఇచ్చేంతవరకు వరకు మిల్లులో ఉత్పాదన అమ్మేందుకు అనుమతించమని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే రెండు ట్రక్కులను అడ్డుకున్నామన్నారు. దీంతో యూనిట్ చీఫ్ ఆందోళనకారులతో మాట్లాడారు. ఈనెల 29వ తేదీలోగా ఒక నెల జీతం ఇస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

గణతంత్ర వేడుకలకు విద్యార్థులు



పరేడ్‌కి వెళ్తున్న విద్యార్థులతో అధికారులు

భువనేశ్వర్: ఈ ఏడాది న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఎన్‌సీసీ అభ్యర్థులు బయల్దేరారు. రాష్ట్రం నుంచి 122 మంది అభ్యర్థులు జాతీయ గణతంత్ర దినోత్సవ పేరేడ్‌కు ఎంపికయ్యారు. తొలి విడతలో 29 మంది క్యాడెట్లు బుధవారం న్యూఢిల్లీకి బయల్దేరారు. వీరంతా విమానంలో న్యూఢిల్లీకి వెళ్లడం విశేషం. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీసీ అభ్యర్థులకు ఉచితంగా విమానంలో ప్రయాణ సౌకర్యం కల్పించిందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి అతనుస్ సవ్యసాచి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో 29 మంది అభ్యర్థులకు టోపీ ప్రదానం చేసి అభినందించారు. వీరిలో 23 మందికి ఇదే తొలి విమానయానం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

పట్టపగలే దోపిడీ

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని దువ్వుపేటలో పట్టపగలే ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లారు. దువ్వు లక్ష్మీ బుధవారం ఉదయం పొలంపనులకు వెళ్లి ఇంటికి తిరిగి ఉదయం 11 గంటలకు వచ్చేసరికి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారం, 32 తులాల వెండి, రూ.16 వేలు నగదు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడిన వంజరాపు రాము, కార్తీక్

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డుపై ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు వ్యక్తులు పక్కనే ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. మడపాంకు చెందిన వంజరాపు రాము(రాజు) నరసన్నపేట బండివీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న తన మేనల్లుడు కార్తీక్‌ను వెంట పెట్టుకొని మెయిన్ రోడ్డుపైకి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన రాముకు నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కార్తీక్ నరసన్నపేటలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నరసన్నపేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనం ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్‌లో గరికపేట విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకాన్ని చూపిస్తున్న ప్రవీణ్ కుమార్

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 25 నుంచి రాజస్థాన్ వేదికగా జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని గరికపేట గ్రామానికి చెందిన సీర ప్రవీణ్ కుమార్ కాంస్య పతకం సాధించాడు. అండర్ –19 విభాగంలో 55 కిలోల విభాగంలో పాల్గొని స్నాచ్ 83 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 105 కిలోలు..మొత్తంగా 188 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

11 మద్యం బాటిల్స్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిల్స్

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బాటిల్స్‌ను, నిందితుడిని పట్టుకుని, కేసునమోదుచేసినట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ దాడిలో 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి, కోర్టుకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాలూరులో 80మద్యం సీసాలు..

సాలూరు: అక్రమంగా మద్యంసీసాలు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోటవీధి జంక్షన్ వద్ద వాహనతనిఖీలు చేపడుతుండగా, మక్కువ నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న దత్తివలసకు చెందిన చప్పల ప్రసాద్‌ను తనిఖీ చేయగా 80 మద్యం బాటిల్స్ కలిగి ఉన్నట్లు గుర్తించి బైక్‌ను, బాటిల్స్ సీజ్ చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేశామన్నారు.

వీడీఆర్ఎల్ ల్యాబ్ పరిశీలన



వైద్యులతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మిమ్స్ ఆస్పత్రిలో ఉన్న వీడీఆర్ఎల్ ల్యాబ్‌ను డీఎంహెచ్ఓ భాస్కరరావు బుధవారం పరిశీలించారు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పరీక్షలు చేయడానికి ఎటువంటి ఏర్పాట్లు చేయాల్సి ఉందో పరిశీలించడానికి వచ్చినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. పరీక్షలు చేయడానికి పరికరాలు, సిబ్బంది తదితర అంశాలపై అక్కడి వైద్యులతో చర్చించారు.

మూడువేల లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులో మూడువేల లీటర్ల సారాను బుధవారం ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 31 వరకు పట్టుబడిన 26 కేసుల్లో సీజ్ చేసిన 3000 లీటర్ల నాటుసారాను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్ విధానం వద్దు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధకశాఖలో క్లస్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టేందుకు చేస్తున్న సన్నాహాలకు స్వస్తి పలకాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ పోలా గోవిందరావు కోరారు. ఈ మేరకు స్థానిక పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖలో క్లస్టర్ విధానం వల్ల వివి ధ హోదాల్లో పనిచేస్తున్న పారావెట్స్ హోదా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశా రు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ ప శువులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆది నారాయణ, తారకేశ్వర్రావు, ధర్మతేజ, పిల్లా రామకృష్ణ, ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రితో మాట్లాడాలనుందా..?

- 6 నుంచి 12 క్లాస్ విద్యార్థులు,
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవకాశం



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

సీతంపేట: ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా? అయితే ఆ అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. మీరు చేయాల్సిందల్లా ప్రధాన మంత్రి పరీక్ష పే చర్చ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉంది. ఏటా పబ్లిక్ పఎరీక్షల ముందు పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ ఇప్పటి వరకు 6 వ ఎడిషన్‌ను పూర్తి చేసుకుంది. ఇప్పుడు 7వ ఎడిషన్ నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలను సమర్థంగా, ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, చిరునవ్వుతో ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రోత్సహించనున్నారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు ప్రధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 12వరకు గడువు

పరీక్షల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి? ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? వారి ఆకాంక్షలు ఏమిటి ? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలేమిటి? పరీక్షల పమయంలో ప్రశాంతంగా ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై పరీక్షాపే చర్చ కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల లోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పరీక్షా పే చర్చలో పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలను కూడా ఆన్‌లైన్‌లో పంపే అవకాశాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కల్పించింది.

విజేతలుగా నిలిస్తే..

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధాన మంత్రిని కలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి విజేతకు కిట్, ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను పొందే అవకాశం ఉంది.

లాగిన్ ఇలా అవ్వాలి

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హెచ్‌టీపీపీఎస్// ఐఎన్ఎస్‌వో వీఏటీఇండియా.మైజీవోవీ.ఇన్ లింక్‌ను క్లిక్ చేసి, మొబైల్ నంబర్ లేదా జీ మెయిల్ ఖాతాను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ అవ్వాలి. విద్యార్థులు/ ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు ప్రాథమిక వివరాలను పూర్తి చేయాలి. కార్యాచరణ వివరాలను పూర్తి చేసిన తర్వాత థీమ్‌ను ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. పరీక్షా పే చర్చలో ఎంపికైన సుమారు 2050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యామంత్రిత్వశాఖ పీపీసీ కిట్‌లను బహుమతిగా అందజేయనున్నారు.

అందరికీ మంచి అవకాశం



పరీక్షా పే చర్చ కార్యక్రమం మంచి అవకాశం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. పరీక్షలంటే భయం పోగొట్టుకునేందుకు ఇదో మంచి తరుణం. జాతీయస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా చూడాలి.

–ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈవో

ఆరు రోడ్లకు అటవీ అనుమతులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆరు రోడ్లకు జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ అనుమతులు ఇచ్చిందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలతో ఆయన సమావేశం నిర్వహించి కమిటీ ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. ఆయా గ్రామాలను ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడానికి, గిరిజనులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రాముఖ్యత దృష్ట్యా రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇవ్వగా, ఆరు రోడ్ల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రతిపాదనలు సమర్పించారు. నిర్ణీత సమయంలో ప్రతిపాదనలను క్లియర్ చేయడంలో కృషిచేసినందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అధికారులను అభినందించారు. అటవీ శాఖ కమిటీ సభ్యుడు పాచిపెంట జెడ్పీటీసీ కె.సింహాచలం మాట్లాడుతూ జిల్లా కొత్తగా ఏర్పడడం, కలెక్టర్ నేతృత్వంలో అటవీ అనుమతులు సకాలంలో జారీచేయడంతో పాచిపెంట మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగుతోందని, గ్రామాలలోని సమస్యలు పరిష్కారమయ్యాయని సంతోషం వెలిబుచ్చారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా అటవీశాఖాధికారి జీపీఏ ప్రసూన, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ జె.శాంతీశ్వరరావు, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

28,29తేదీల్లో అంవతిలో మెగా జాబ్ మేళా

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 28, 29 తేదీల్లో 1800 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, ఆటోమొబైల్, మార్కెటింగ్, బ్యాంకింగ్, బీపీవో సెక్టార్స్‌కు సంబంధించిన 40 కంపెనీలు పాల్గొంటాయని తెలియజేశారు. నిరుద్యోగ యువతీయువకులు ఏపీ స్కిల్ యూనివర్స్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు కూడా అవకాశం ఉందని చెప్పారు. టెక్ మహీంద్రా, టెక్ విజన్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్, బి డేటా టెక్నాలజీ, రోవర్ ఐటీ టెక్నాలజీ, చందూ సాఫ్ట్ టెక్నాలజీ, డాక్టర్ రెడ్డీస్, హెటిరో డ్రగ్స్, స్మైలెక్స్ ల్యాబొరేటరీస్, డెక్కన్‌ఫైన్ కెమికల్, అరబిందో, లీ ఫార్మా, అపోలో ఫార్మసీ, సెయింట్ గోబియన్, యెకోహామా టైర్స్, సినర్జీస్, కాస్టింగ్స్, జయభేరి ఆటోమోటివ్స్, లక్ష్మి హ్యుండయ్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్, నవత రోడ్‌ట్రాన్స్‌పోర్ట్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌తో పాటు మరిన్ని కంపెనీలు పాల్గొంటాయని ఎమ్మెల్యే వివరించారు. సెయింట్ గోబియన్‌లో డిప్లొమో పాస్ లేదా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులకు కూడా జాబ్‌మేళాలో అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555868681, 9948768778 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ధాన్యం బిల్లులకు ఢోకా లేదు

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రామభద్రపురం: రైతుల వద్ద ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం బిల్లులకు ఢోకా లేదని,సేకరించిన వారం రోజులలోపే రైతుల ఖాతాలకు జమ అవుతున్నాయని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. రామభద్రపురం వచ్చిన సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించేందుకు రూ.81 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 1,00,750 టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, అంతకు మరో మూడింతలు సేకరణ చేయవచ్చన్నారు. రైతులు దళారుల మాయలో పడి మోసపోకూడదని,కనీస మద్దతు ధర లభించాలన్న ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల ప్రత్యేకాధికారి ఎస్.గోవిందరావు, ఎంపీడీవో రమామణి, తహసీల్దార్ సులోచనరాణి, పీడీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడల పరిశీలన

ఆడుదాం ఆంధ్రా క్రీడల పరిశీలకు రామభద్రపురం వచ్చిన సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక ఉన్నత పాఠశాలలో టెంట్‌లు,ఆర్చ్ తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు జేసీ నిర్వహించిన కాన్ఫరెన్స్‌ను ఎంపీడీవో, కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. షెడ్యూల్ ప్రకారం క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడాకారులకు, వచ్చిన ప్రేక్షకులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణంలో మార్పులు చేసినట్లయితే రెండు రోజుల ముందుగా క్రీడాకారులకు తెలియజేయాలని ఎంపీడీవోకు సూచించారు. ఏ రోజుకారోజు క్రీడలను సకాలంలో అప్‌డేట్ చేయాలని తెలిపారు. తప్పనిసరిగా స్కోర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఆడుదాం-ఆంధ్రా పోటీలకు నిధులు

- ఒక్కో సచివాలయానికి రూ.10వేలు విడుదల

విజయనగరం: ఓవైపు ప్రతిభ గల క్రీడాణిముత్యాలను వెలికితీయడంతో పాటు మరో వైపు ఆరోగ్యకరమైన సమాజమే ధ్యేయంగా 46 రోజుల పాటు నిర్వహించతలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. జిల్లాలోని 626 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒక్కో సచివాలయం పరిధిలో పోటీల నిర్వహణ ఖర్చుల కోసం రూ.10వేలు వంతున రూ.62.60 లక్షలు జిల్లాలోని ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 530 సచివాలయాలకు రూ.53 లక్షలు, 96 పట్టణ ప్రాంత వార్డు సచివాలయాలకు రూ.9.60 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులను వినియోగించి పోటీల నిర్వహణకు ఆయా క్రీడా మైదానాల వద్ద పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్‌లు, మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు

అంకిత భావంతో పనిచేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నూతనంగా విధుల్లో చేరిన వైద్యాధికారులకు విధులపై శిక్షణ ఇచ్చారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఎస్ఈ అభినందన



క్రీడల్లో రాణిస్తున్న విద్యుత్ ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు

విజయనగరం: ఓ వైపు విధి నిర్వహణతో పాటు మరో వైపు ఆసక్తి కలిగిన క్రీడా రంగంలో రాణిస్తున్న విద్యుత్ ఉద్యోగులను ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు అభినందించారు. ఈనెల 24,25 తేదీల్లో ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన రికార్డ్ అసిస్టెంట్ పి.పైడిరాజు 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పోటీలో సిల్వర్ పతకం, 400 రిలే పోటీలో మరో సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. అదేవిధంగా ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఎస్‌కోట సెక్షన్ పరిధిలోని గ్రేడ్–2 జేఎల్ఎం పి.మణిబాబు, పైడిరాజులను ఎస్ఈ లక్ష్మణరావు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల గేమ్స్ ప్రధాన కార్యదర్శి పూడిహరి, గేమ్స్ కార్యదర్శి వి.మోహనబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అప్పలసూరి, ఏడీఈ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచ్ సేవలు



సవరవిల్లిలో ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: మండలంలోని సవరవిల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్‌ను (భోగాపురం బ్రాంచ్) ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ బ్రాంచ్ ద్వారా పంటలు, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, పట్నా తాతయ్యలు, పడాల భానుప్రకాశ్, సుందర హరీష, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొట్టి వివాహిత మృతి



మరణించిన గౌరి

సాలూరు: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వివాహిత బి.గౌరి(60) బైక్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ సంఘటనపై పట్టణ సీఐ శ్రీనివాస రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటిలోని చెత్తను రోడ్డు అవతల వేసేందుకు గౌరి వెళ్లిన సమయంలో, సాలూరు నుంచి గుర్రాపువలస వైపు వెళ్తున్న వాహన చోదకుడు సూరిబాబు ఢీకొట్టాడు. బైక్ ఢీకొట్టిన వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిన గౌరిని విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సూరిబాబును అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.

వ్యాన్ బోల్తా పడి 10 ఆవుల మృతి



బోల్తాపడిన వ్యాన్



మరణించిన ఆవులు

సాలూరు: ఒడిశా రాష్ట్రంలోని సిమిలిగుడ నుంచి మానాపురం సంతకు సుమారు 40 ఆవులతో వెళ్తున్న గూడ్స్ వ్యాన్ బుధవారం సాలూరు బైపాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో 10 ఆవులు మరణించాయని, మరికొన్ని ఆవులకు గాయాలయ్యాయని పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, క్లీనర్ గాసిహరిజన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పైడితల్లి అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న, ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి క్యాలెండర్‌ను పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలో ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ముఖచిత్రంతో కూడిన క్యాలెండర్‌ను భక్తులకు ఉచితంగా అందజేసేందుకు చదురుగుడి, వనంగుడిలో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. అవకాశం ఉన్న భక్తులు అమ్మవారి క్యాలెండర్‌ను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డుసభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

22లోగా అభ్యంతరాల పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఎన్నికల కమిషన్ వచ్చేనెల 22వరకు గడువు పెంచిందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తుది ఓటరు జాబితాను జనవరి 5న కాకుండా 22న విడుదల చేస్తామని చెప్పారు. బీఎల్ఓలు మరోసారి చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను తనిఖీ చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈవీఎం గొడౌన్ తనిఖీ ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులంతా హాజరుకావాలని కలెక్టర్ కోరారు. బూత్ స్థాయిలో స్వీప్ కార్యక్రమాలు జరపాలని, ఈవీఎంల డెమో నిర్వహించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుధారాణి, సుదర్శన దొర, నూకరాజు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ నేడు ప్రారంభం

- హాజరు కానున్న ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు



జరజాపుపేటలో ప్రారంభించనున్న అర్బన్ పీహెచ్‌సీ

నెల్లిమర్ల:

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయింది. నగర పంచాయతీ ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. ప్రజారోగ్యానికి సంబంధించి అర్బన్ పీహెచ్‌సీని జరజాపుపేటలో రెండేళ్లక్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే అక్కడి ప్రజలకు సేవలు అందుతున్నాయి. ఇక్కడ ఆపరేషన్‌థియేటర్, 10 బెడ్లు, మందుల షాపు, ఓపీ కౌంటర్, ఎమర్జెన్సీల్యాబ్, మీటింగ్‌హాల్‌తో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారు. అలాగే రోజుకో స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. దీంతో నగర పంచాయతీ ప్రజలతో పాటు మొయిద విజయరాంపురం, పూతికపేట, కొండగుంపాం, గరికపేట, పారసాం, చంద్రంపేట, టెక్కలి, చినబూరడపేట, పెదబూరాడపేట తదితర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఈ పీహెచ్‌సీ ఉంది. ఈ అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1 కోటీ 11లక్షల70వేలు మంజూరు చేసింది. అతి తక్కువ సమయంలో నిర్మాణం పూర్తికావడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



నగర పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. నగర పంచాయతీ ప్రజలకు ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనివల్ల నగర పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. మాకు ఇన్ని సదుపాయాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–బంగారు సరోజిని, చైర్‌పర్సన్, నెల్లిమర్ల నగర పంచాయతీ

ప్రజల ఆకాంక్ష నెరవేరింది



అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసిన రెండేళ్లలో ప్రభుత్వం చొరవతీసుకుని రూ.కోటి 11లక్షల నిధులతో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసింది. నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు తీసుకున్న చొరవ మరువలేనిది. నగర పంచాయతీ ప్రజల ఆకాంక్ష నెరవేరింది.

–చిక్కాల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ